క్లుప్తంగా

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



సంగం: జంగాలకండ్రికలోని కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణాన్ని బుధవారం అర్ధరాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గంగపట్నం చంద్రశేఖరయ్య, సర్పంచ్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి సహకరించాలని వినతి



ఉదయగిరి: వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కొట్టాలపల్లి సొసైటీ మాజీ చైర్మన్ మూలె వినయ్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయగిరి అభివృద్ధికి సహకరించాలని, ఉదయగిరిలో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, ఉదయగిరి–బండగానిపల్లి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ మూలె సుబ్బారెడ్డి ఉన్నారు.

భూమి పూజ



ఉదయగిరి: అప్పసముద్రం జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి జెడ్పీటీసీ మోది రామాంజనేయులు గురువారం భూమిపూజ నిర్వహించారు. హెచ్‌ఎం జీ వెంకటేశ్వర్లు, పీఎంసీ చైర్మన్ చేజర్ల సుధాకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ దారపనేని పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కావలి: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వేసవిలో వడదెబ్బకు గురికాకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రెడ్‌క్రాస్ జిల్లా ఇన్‌చార్జి చైర్మన్ దామిశెట్టి సుధీర్‌నాయుడు, రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రం కన్వీనర్ బెజవాడ రవికుమార్, కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దొరసానమ్మ మృతికి నివాళి



ఆత్మకూరు: పట్టణంలో మూడున్నర దశాబ్దాలుగా మహిళలకు విశేష వైద్యసేవలు అందించిన ప్రముఖ డాక్టర్ వింజం దొరసానమ్మ అనారోగ్యంతో గురువారం వేకువన మృతి చెందారు. పట్టణంలోని నివాసంలో ఆమె భౌతికకాయాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. దొరసానమ్మ భర్త డాక్టర్ వెంకటేశ్వరస్వామి, కుమార్తె డాక్టర్ హారిక, అల్లుడు డాక్టర్ ప్రణీత్‌కు సానుభూతి తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మాజీ జెడ్పీటీసీ సీహెచ్ మంజూష, బొల్లినేని ఆస్పత్రి ఈడీ గిరినాయుడు, మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కే విజయ భాస్కర్‌రెడ్డి, పీ వెంకటేశ్వర్లు, ముజీబ్, తదితరులు నివాళులర్పించారు.

బైక్ అపహరణ

అల్లూరు: స్థానిక ఎస్‌బీఐ బ్యాంకు వద్ద పార్కింగ్ చేసిన బైక్ అపహరణకు గురైన ఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాలు..విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి చెందిన నాటారు శీనయ్య తన స్ప్లెండర్ ప్లస్ బైక్(ఏపీ39 ఈఎస్5702)పై అల్లూరులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్దకు వచ్చాడు. బ్యాంకు ఆవరణలో బైక్‌ను పార్కింగ్ చేసి లోనికి వెళ్లాడు. బ్యాంకు పని ముగించుకుని తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సంజీవిని ఆరోగ్య రథం ప్రారంభం

వరికుంటపాడు: యర్రంరెడ్డిపల్లిలో సంజీవిని ఆరోగ్య రథాన్ని కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాకర్ల సురేష్ గురువారం ప్రారంభించారు. సంజీవిని ఆరోగ్య రథం ద్వారా 200కుపైగా వ్యాధి నిర్ధారణ, ఈసీజీ, తదితర పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రైతులకు పవర్ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. స్థానికులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని 38వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అభివృద్ధి అటకెక్కిందంటూ టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండించారు. గణాంకాలతో సహా అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కావలి నియోజకవర్గంలోని పేదల ఖాతాల్లో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు రూ.300 కోట్లకుపైగా జమచేసినట్లు వివరించారు. 25వేల మందికి నివేశన స్థలాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కావలిలోని మెగా లేఅవుట్‌లోనే 9వేల మందికి నివేశన స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. టీడీపీ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో ఇళ్లను సీఎం సహకారంతో పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నామన్నారు. సంగం బైపాస్ కెనాల్, చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బైపాస్ కెనాల్, కావలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను మంజూరు చేయించామని తెలిపారు. రామాయపట్నంపోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. కలుగోళమ్మ ఆలయం వద్ద బ్రిడ్జిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. ముసునూరు నుంచి మద్దూరుపాడు వరకు ట్రంకు రోడ్డు విస్తరణ పనులకు రంగం సిద్ధం చేసినట్లు వివరించారు. తనపైన, వైఎస్సార్‌సీపీపైన నమ్మకంతో కావలి నియోజకవర్గ ప్రజలు తనను రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా శాశ్వత ప్రయోజనం చేకూరేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, గుడ్లూరు మాల్యాద్రి, ఏగూరు చినపుల్లయ్య, కుందుర్తి శ్రీనివాసులు, షేక్ షాహుల్ హమీద్, పిచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కావలి: సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పార్టీలోకి టీడీపీ నేతలను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీలో చేరిక

పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సమక్షంలో గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీ నాయకులు భాస్కర్, మల్లి, రాఘవ, తదితరులకు ఎమ్మెల్యే రామిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రెండో పంటకు సాగునీరు విడుదల



ఆత్మకూరు: ఆత్మకూరు చెరువు ఆయకట్టు కింద రెండో పంటకు గురువారం సాగునీరు విడుదల చేశారు. చెరువు 3వ నంబర్ తూము వద్ద రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీరు విడుదల చేశారు. రబీ పంట దిగుబడులు బాగా రావడంతో పాటు ధాన్యం ధరలు సైతం ఆశాజనకంగా ఉండడంతో ఉత్సాహంతో రెండో పంట సాగుకు సమాయత్తం అవుతున్నట్లు రైతులు తెలిపారు. సాగునీటి విడుదలతో నారు పోసుకునేందుకు సిద్ధమైన రైతులు హర్షం వ్యక్తం చేశారు. రైతులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, పుచ్చలపల్లి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, బీ సుధాకర్‌రెడ్డి, ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కావలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ మనవడు యశ్వంత్‌రావు అంబేడ్కర్‌ను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి గురువారం సత్కరించారు. కావలి మండలం చలంచర్లలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన ఆయన్ని కావలి పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనంలోని అతిథి గృహంలో ఎమ్మెల్యే కలిసి శాలువాతో సత్కరించారు.ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, పండిటి కామరాజు, నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ షాహుల్‌హమీద్ ఉన్నారు.



1513 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో గురువారం 888 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు. తిక్కవరం క్లస్టర్‌కు చెందిన రైతులు 928 బేళ్లను వేలానికి తీసుకురాగా, 888 బేళ్లను కొనుగోలు చేసినట్లు చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.177 ధర పలికిందని వివరించారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం 625 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 665 బేళ్లను వేలానికి, తీసుకురాగా 625 బేళ్లను కొనుగోలు చేశారని వివరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.200, కనిష్టంగా రూ.160 ధర పలికిందని తెలిపారు.

గృహాలను పూర్తి చేయాలి

సీతారామపురం: జగనన్న కాలనీల్లో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ ఏఈ రామకృష్ణ సూచించారు. బసినేనిపల్లిలోని జగనన్న కాలనీలో నివేశన స్థలాల లబ్ధి దారులకు గృహ నిర్మాణాలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తోందని తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా రూ.35 వేలు రుణం అందజేస్తుందన్నారు. లబ్ధిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవా లని కోరారు. వర్క్‌ఇన్‌స్పెక్టర్ చెన్నారాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు

ఆత్మకూరు: నెల్లూరులో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆత్మకూరు అపస్మా నాయ కులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రైవేట్ పాఠశాలలకు అనుమతులు పొందే గడువును 3 నుంచి 8 ఏళ్లకు పెంచడానికి కృషి చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. పాఠ్య పుస్తకాల సరఫరా ఆలస్యం కాకుండా ప్రైవేట్ సంస్థలకు ముద్రణ అప్పగించడంపై సంతోషం వ్యక్తం చేశారు. అపస్మా అధ్యక్షుడు ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రీ సర్వేపై సమీక్ష

చేజర్ల(సోమశిల) : అనంతసాగరం మండలం లింగంగుంట సచివాలయంలో రీ సర్వేపై ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి గురువారం సమీక్ష నిర్వహించారు. రీ సర్వేపై రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. లింగంగుంటలో రైతుల సమక్షంలో త్వరితగతిన హద్దు రాళ్లను నాటాలని సర్వేసిబ్బందిని ఆదేశించారు. డీటీ ప్రదీప్, ఉపసర్పంచ్ ఎం సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ నిధులతో మౌలిక వసతుల కల్పన

దుత్తలూరు: మండలంలోని ఏరుకొల్లు, నర్రవాడ, కొత్తపేట సచివాలయాల పరిధిలో సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి ఎంపీపీ జయంత్‌రెడ్డి గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ నిధులతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎంపీడీఓ సాయిప్రసాద్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ చేజర్ల చలమారెడ్డి,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వాసిపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు ఎం సుబ్బరాయుడు, షేక్ మస్తాన్‌బీ, ఏ రమేష్‌రెడ్డి, టీ వెంగయ్య, నాయకులు టీ వెంగయ్య, ఎల్ బ్రహ్మరెడ్డి, ఏ చెంచురెడ్డి, మీరావలి, ఎస్ రమణారెడ్డి, దయాకర్, చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

సమయాన్ని పాటించాలి

జలదంకి: సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించాలని కావలి ఆర్డీఓ శీనానాయక్ అన్నారు. గురువారం ఆయన జలదంకి 1,2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. గ్రీవెన్స్‌కు సంబంధించిన రికార్డులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించడంలేదని కలెక్టర్ దృష్టికి రావడంతో తాను సచివాలయాలను తనిఖీ చేశానని, మరోసారి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, డీటీ భరత్, వీఆర్వోలు వద్మావతి, రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న కావలి ఆర్డీఓ శీనానాయక్

ఏఎస్సైకు ఎస్పీ ప్రశంసలు



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఈ నెల 16న వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఆదినారాయణ నెల్లూరులోని స్విమ్స్ ఆస్పత్రిలో గుండె పరీక్షలు చేయించుకున్నాడు. ట్యాక్సీలో తిరిగి ఇంటికి వెళ్తుండగా మర్రిపాడు వద్ద గుండెపోటుకు గురై భార్య శివలక్ష్మి చేతుల్లో ప్రాణాలు విడిచాడు. మృతదేహాన్ని ట్యాక్సీడ్రైవర్ మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో దించేసి వెళ్లిపోయాడు. నడిరోడ్డుపై భర్త మృతదేహం తో భార్య విలపిస్తున్న విషయం తెలుసుకున్న మర్రిపాడు ఏఎస్సై శ్రీనివాసులురెడ్డి ఆమెను ఓదార్చి తన సొంత ఖర్చులతో అంబులెన్స్‌లో ప్రొద్దుటూరుకు తరలించారు. ఈ నేపథ్యంలో నెల్లూరులో గురువారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో మర్రిపాడు ఏఎస్సై కాసా శ్రీనివాసులురెడ్డిని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలో 20 ఏళ్లుగా భిక్షాటన చేస్తున్న బీహార్‌కు చెందిన వ్యక్తి అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. అనాథ శవానికి వైఎస్సార్‌సీపీ నాయకులు బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఏఎస్సై మస్తాన్‌బాషా మానవతా దృక్పథంతో శవాన్ని మోసుకుపోయి శ్మశానంలో ఖననం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కావలి (దగదర్తి) : దగదర్తి మండలం లయన్స్‌నగర్ కాలనీకి చెందిన హరికృష్ణ (28) బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఉలవపాళ్ల సమీపంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలు..లయన్స్ నగర్ కాలనీకి చెందిన హరికృష్ణ బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అనారోగ్యంతో కావలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్యను చూసేందుకు వెళ్లాడు. ఆమెను చూసి మద్యం సేవించి బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఉలవపాళ్ల వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దగదర్తి ఎస్సై సుమన్ కేసు దర్యాప్తు చేపట్టారు.

జగనన్నే మా భవిష్యత్తు



కలిగిరి: వీర్నకల్లు పంచాయతీలో జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గడప గడపకు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ డీ శ్రీనివాసులు, ఉపసర్పంచ్ మూలి రాధాకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నదే



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నాగులవెలటూరు సచివాలయ పరిధిలోని బిల్లుపాడు, నాగులవెలటూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యేను పలు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మాతమ్మ గుడి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ చరిత్రలోనే నూరు శాతం మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి జగనన్న చర్యలు చేపట్టారని తెలిపారు. ఇప్పటికే చుక్కల భూముల సమస్యలను 80 శాతం పరిష్కరించారని చెప్పారు. నియోజకవర్గంలోని 17 వేల ఎకరాల చుక్కల భూముల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. సాదాబైనామాల కోసం నూతనంగా జీఓ విడుదల చేశారని చెప్పారు. వందేళ్ల తర్వాత రీ సర్వే చేపడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం వంద రోజులు పూర్తి చేసుకుందని, విజయవంతానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఇప్పటి వరకు 48 సచివాలయాల పరిధిలోని 66 పంచాయతీల్లోని సుమారు 200 గ్రామాల్లో పర్యటించామన్నారు. 40 వేల నుంచి 50 వేల గృహాలను సందర్శించి ప్రజలతో మమేకమైనట్లు తెలిపారు. బిల్లుపాడు, నాగులవెలటూరు ప్రజలు సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. నాగులవెలటూరు సచివాలయ పరిధిలో ఇప్పటి వరకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.15 కోట్ల వరకు వెచ్చించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, మండల సొసైటీ అధ్యక్షుడు బూదళ్ల వీరరాఘవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్ రెడ్డి, వైస్‌ఎంపీపీ తిరుపతి నాయుడు, నాయకులు గోనుగుంట రాంబాబు, రవీంద్ర నాయుడు, ఓబయ్య నాయుడు, మురళీకృష్ణయాదవ్, రఫీ, యర్రగుంట పెంచలయ్య ఆదిరెడ్డి మస్తాన్‌రెడ్డి, తేళ్ల శేఖరరెడ్డి, నాగార్జున, పీర్ల జయరామయ్య, చినసుబ్బయ్య ఎంపీడీఓ విజయలలిత, ఏపీఎం చీర్ల సుజన, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

ఆత్మకూరురూరల్: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కరటంపాడు సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వంపై గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కరటంపాడు సచివాలయం పరిధిలోని ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాలు, సేవలను వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో బాధ్యతగా పనిచేయాలని కోరారు. సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రేవూరు అంకయ్య, వీఆర్వో ప్రతాప్, ఎంపీటీసీ సభ్యుడు ఖాసీంసా, సచివాలయ కన్వీనర్ పఠాన్ రఫీ, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

నేడు టిడ్కో గృహాల ప్రారంభోత్సవం

- రూ.161.11 కోట్లతో 2,112 గృహాల నిర్మాణం
- మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ

కావలి: పట్టణంలోని మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయాన్ని మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో రూ.161.11 కోట్లతో నిర్మించిన 2,112 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. మద్దూరుపాడులో టిడ్కో ఇళ్లను జీ ప్లస్ 3 ప్రాతిపదికపై అపార్ట్‌మెంట్లుగా నిర్మించారు. ఇందులో 17 అపార్ట్‌మెంట్ బ్లాకుల్లో 430 చదరపు అడుగులు, 27 అపార్ట్‌మెంట్ బ్లాకుల్లో 365 చదరపు అడుగులు, 22 అపార్ట్‌మెంట్ బ్లాకుల్లో 300 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్లను నిర్మించారు. మొత్తం 20.90 ఎకరాల విస్తీర్ణంలో 2,112 ఇళ్ల నిర్మాణానికి రూ.145.23 కోట్లను ఖర్చు చేశారు. మౌలిక సదుపాయాల కల్పనకు మరో రూ.15.88 కోట్లు ఖర్చు అయ్యాయి. కాగా 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఇళ్లు పేదలకు ఉద్దేశించినవి. వీటి లబ్ధిదారులైన 704 మందికి కేవలం ఒకే ఒక్క రూపాయి మాత్రమే చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేలా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వీటికి గత టీడీపీ ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.2.65 లక్షలు రుణంగా చెల్లించేలా నిర్ణయించింది. కానీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. తద్వారా ప్రభుత్వంపై రూ.18.65 కోట్ల మేర ఆర్థిక భారం పడుతున్నా భరించడానికి సిద్ధమైంది. అలాగే 365 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన గృహాల లబ్ధిదారులు 864 మంది ప్రభుత్వానికి ప్రాథమికంగా రూ.50వేలు చెల్లించాలని గత టీడీపీ ప్రభుత్వం నిబంధన పెట్టింది. అయితే ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.25వేలకు తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనివల్ల ప్రభుత్వంపై రూ.2.16 కోట్ల మేర భారం పడింది. అలాగే 430 చదరపు అడుగులు విస్తీర్ణం కలిగిన 544 ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ. లక్ష చెల్లించాలని టీడీపీ ప్రభుత్వం నిబంధన పెట్టగా, దానిని వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.50వేలకు పరిమితం చేసింది. దీనివల్ల ప్రభుత్వంపై రూ.2.72 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఇలా మూడు కేటగిరీలకు చెందిన టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.23.53 కోట్ల మేర లబ్ధి చేకూర్చింది.



కావలిలోని టిడ్కో గృహ సముదాయం

మెరిసిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

ఉదయగిరి: ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ప్రతిభకనబరిచారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించారు. ఉదయగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 71 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కిరణ్ గురువారం తెలిపారు. మొత్తం 174 మంది పరీక్షలకు హాజరుకాగా, 123 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో అబ్దుల్‌అలీం 445, బైపీసీలో అప్సన 407, హెచ్‌ఈసీలో లావణ్య 414 మార్కులు సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో అస్మ 962, ఎంపీసీలో ప్రసాద్ 903, హెచ్‌ఈసీలో అనంతలక్ష్మి 846 మార్కులు సాధించారని వివరించారు. వచ్చే నెల 24 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు 3వ తేదీలోగా ఫీజు చెల్లించాలని సూచించారు.

సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు

కలిగిరి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభకనబరిచారని ప్రిన్సిపల్ ఏ శ్రీను తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వడ్లమూడి సుస్మిత 974, కే ఆర్తీ 951, సీహెచ్ భార్గవ్ 549, బైపీసీలో జీ వనజాక్షి 827, సీఈసీలో ఏ అశ్రిత 748 మార్కులు సాధించారని వివరించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో పీ మధుప్రియ 438, బైపీసీలో త్రిపుర 403, సీఈసీలో మాధురి 341 మార్కులతో టాపర్లుగా నిలిచారని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



సీతారామపురంలో ద్విజతకు సన్మానం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఇంటర్ ఫలితాల్లో మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల, నందవరం మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్ హనుమంతరాజు, పేట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మర్రిపాడు జూనియర్ కళాశాలలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో ఓరుగంటి నందిని 975, ప్రథమ సంవత్సరంలో పాదిలి ప్రవళిక 440 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో కే వాణి 840 మార్కులు సాధించారు. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఓరుగంటి నందిని 975 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. నందవరం మోడల్ స్కూల్‌లో జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థులు విష్ణుప్రియ 453, అశ్విత 432, రుచిత 420 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో మణిచందన 381, మొబీనా 338 మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీ విభాగంలో ఎం స్వాతి 973, నాగమహేశ్వరి 947, షమీ 938, లహరి 921 మార్కులు సాధించారు. సీనియర్ ఎంపీసీ విభాగంలో బ్రాహ్మణి 960, తేజస్విని 959, శ్రావ్య 945, యామిని 917, నందిని 906, శ్రావ్య 905, సుస్మితా 902 మార్కులు సాధించారు. సీనియర్ సీఈసీ విభాగంలో సరస్వతి 823, సీనియర్ ఎంఈసీ విభాగంలో స్రవంతి 714 మార్కులు చొప్పున సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 95.45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ఆత్మకూరు: ఆత్మకూరు జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 82 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ ఎం వాసుబాబు తెలిపారు. పుచ్చల ప్రసన్న 951 మార్కులు సాధించిందని చెప్పారు. ప్రథమ సంవత్సరంలో 57 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థినికి సన్మానం

సీతారామపురం: స్థానిక మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థిని కలివెల ద్విజిత 440 మార్కులకు గానూ 428 మార్కులు సాధించింది. జిల్లాలోని మోడల్ స్కూళ్లలో టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ద్విజితను మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ మస్తాన్‌వలి, మోడల్ స్కూల్ సిబ్బంది శాలువాతో సత్కరించారు. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ రెహమాన్ పాల్గొన్నారు.